దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఐటీఐలో కొత్తగా ప్రవేశపెట్టిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ కంట్రోల్ ఆటోమేషన్‌లో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో 40 సీట్లు, ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్‌లో 20 సీట్లు, బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైయర్‌లో 24 సీట్లు, అడ్వాన్స్‌డ్ ఎనిమేషన్ టెక్నీషియన్‌లో 24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్‌లో 24 సీట్లు ఉన్నాయన్నారు. ఈ కోర్సులకు ఈ నెల 5 నుంచి 9వరకు ఎంపిక జరుగుతుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు iti.telangana.gov.in వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

121 రకాల నైవేద్యాలు

ములుగు పట్టణంలోని రామాలయం ప్రాంగణంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 121 రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. దుర్గా మాతా శనివారం అన్నపూర్ణదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

– న్యూస్‌టుడే, ములుగు



ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ములుగు, న్యూస్‌టుడే: డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. అధికారికంగా ఈనెల 2 నుంచి ములుగులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పరిశీలన ప్రారంభం కాగా, శనివారంతో ముగిసింది. 1:3 నిష్పత్తి ప్రకారం ఎస్జీటీ పోస్టులకు జిల్లాలో 480 మంది అభ్యర్థులను ఎంపిక చేసి రాష్ట్ర విద్యాశాఖ జిల్లాకు జాబితాను పంపించింది. జిల్లా కేంద్రంలో డీఈవో జి.పాణిని పర్యవేక్షణలో 12 ప్రత్యేక పరిశీలన బృందాలను ఏర్పాటు చేసి చెక్ లిస్ట్ ఆధారంగా పరిశీలన నిర్వహించారు. మొదటి రెండ్రోజులు మాత్రమే సందడి నెలకొనగా, ఆ తర్వాత నుంచి తగ్గింది. పరిశీలన పూర్తికాగా, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను శనివారం సాయంత్రం నుంచి డీఈవో కార్యాలయంలో మొదలుపెట్టారు.

433 మంది హాజరు

జిల్లాలో 1:3 నిష్పత్తి ప్రకారం 480 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, వారిలో ధ్రువపత్రాల పరిశీలనకు 433 మంది హాజరయ్యారు. 47 మంది సుముఖత చూపలేదు. కారణాలేంటనేది స్పష్టం కాలేదు. ప్రత్యేక విద్యార్థులకు బోధించే ఎస్జీటీ పోస్టులు జిల్లాలో 17 ఉండగా, 1:3 ప్రకారం అర్హత సాధించిన వారు 17 మంది ఉన్నారు. అందులో ధ్రువపత్రాల పరిశీలనకు 10 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లాలో ఏడు పోస్టులు ఖాళీగా ఉండే పరిస్థితి నెలకొంది.

☛ ములుగు జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి ప్రభుత్వ గుర్తించిన ప్రకారం 192 ఖాళీలున్నాయి. ఈ పోస్టులకు 433 మంది పోటీ పడుతున్నారు.



ములుగు జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో..

జిల్లాలో పోస్టుల వివరాలు

	ఖాళీలు	1:3 ప్రకారం	హాజరైన అభ్యర్థులు
భాషా పండితులు	16	42	40
భాషాపండితులు(ఎస్ఎ)	33	94	86
పీఈటీ	1	3	1
ఎస్జీటీ	125	322	296
స్పెషల్ ఎడ్యుకేషన్(ఎస్జీటీ)	17	19	10

● ఖాళీలు / ● 1:3 ప్రకారం
● హాజరైన అభ్యర్థులు

ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం..

– జి.పాణిని, జిల్లా విద్యాశాఖాధికారి



1:3 నిష్పత్తి ప్రకారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ శనివారంతో ముగిసింది. 433 మంది అభ్యర్థుల పత్రాలను సరిచూశాం. పరిశీలించిన వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

లక్ష్మీనరసింహస్వామి శాంతి కల్యాణం



ఆలయంలో భక్తుల రద్దీ

మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మంగపేట మండలంలోని మల్లూరు గుట్టపై కొలువైన శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శనివారం స్వామి వారికి అర్చకులు శాంతి కల్యాణం జరిపించారు. దసరా సెలవుల సందర్భంగా మండల భక్తులతో పాటు హైదరాబాద్, గుంటూరు, ఖమ్మం, కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. చింతామణి జలపాతం వద్ద స్నానాలాచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి శాంతి కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ, అర్చకులు రాఘవాచార్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్రతువును జరిపిస్తున్న వేద పండితులు

దండకారణ్యంలో నిశ్శబ్ద యుద్ధం..!



దండకారణ్యంలో యుద్ధతంత్రాలు మోగుతున్నాయి. పోలీసులు, మావోయిస్టుల మధ్య నిశ్శబ్ద యుద్ధంతో సరిహద్దు అడవులు చిగురుటాకులా వణుకుతున్నాయి. ఇటు తెలంగాణ, అటు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బలు తగులుతుండటం కలవరానికి గురి చేస్తున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్-దంతెవాడ జిల్లా సరిహద్దుల్లో నెందూర్-తుల్‌తులి అడవుల్లో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 31 మంది మావోయిస్టులు మృతి చెందటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉలికిపాటుకు గురైంది.

– వెంకటాపురం(ములుగు జిల్లా), న్యూస్‌టుడే

ఛత్తీస్‌గఢ్ ఘటనతో కలవరం



నెందూర్-తుల్‌తులి అటవీ ప్రాంతం నుంచి మృతదేహాలను తరలిస్తున్న ప్రత్యేక బలగాలు

ఎందుకొచ్చారు.. ఎవరొచ్చారు..



మావోయిస్టు పార్టీ ఆవిర్భావ మాసోత్సవాలను సెప్టెంబరు 20వ తేదీ నుంచి అక్టోబరు 21 వరకు నిర్వహిస్తోంది. ఈ ప్రాంతంలోనూ నిర్బంధాలు, ఎదురుకాల్పులతో పోలీసులదే పైచేయి కాగా, ఆరు రోజుల కిందట వాజేడు మండలంలోని ఓ గిరిజన గ్రామ సమీప అడవుల్లో మావోయిస్టులు సమావేశం నిర్వహించడం పోలీసులకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీకి చెందిన కార్యదర్శి అనిత, డిప్యూటీ సెక్రటరీ మహేందర్‌తో పాటు మరో నలుగురు సాయుధులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు విశ్వసనీయ సమాచారం. కొన్నేళ్లుగా ఇంతటి కవ్వింపు చర్యలకు దిగని నక్సల్స్ ఏకంగా సమావేశంలో పాల్గొనడం వెనుక వ్యూహం ఏమిటనేది నిఘా వర్గాలు కూపీలాగే పనిలో ఉన్నాయి.

కవ్వింపా.. తెగింపా..

సరిహద్దు తెలంగాణాలో మావోయిస్టులు కవ్వింపు చర్యలకు దిగినట్లు ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. గత నెలలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా కరకగూడెం, గుండాల అడవుల్లో జరిగిన ఎదురు కాల్పులు, ఆసిఫాబాద్ రాష్ట్రానికి చెందిన బీకేఎస్‌ఆర్ డివిజన్ కమిటీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. అయినప్పటికీ.. తెగింపు ధోరణితో గత నెల 25 తేదీన వద్ద మండలం పూసుగుప్ప అడవుల్లోని సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపుపై మావోయిస్టులు కాల్పులకు తెగబడటం కలకలం రేపింది. ఈ క్యాంపుపైకి బీజీఎల్(అండర్ బ్యారెల్ గ్రేనేడ్ లాంచర్)లను వినియోగించినట్లు పోలీసుల నిర్ధారణలో తేలింది. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

చక్రబంధంలో సరిహద్దు

మావోయిస్టుల కదలికలు, ఛత్తీస్‌గఢ్ ఘటనతో పోలీసులు సరిహద్దును చక్రబంధంలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పర్యవేక్షణలో ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలో నిఘాను కట్టుదిట్టం చేశారు. ప్రధానంగా వెంకటాపురం పోలీస్ సర్కిల్ పరిధిలో మావోయిస్టుల కదలికలు ఉండే ప్రాంతాలపై డేగకన్ను వేసేలా ఏరియా ఆధిపత్య చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అటవీ ప్రాంతాల ప్రజలను చైతన్యం చేయడంతో పాటు ఎలాంటి ఉపద్రవం ముంచుకొచ్చినా.. తిప్పి కొట్టేలా సంసిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

తనిఖీలు ముమ్మరం

వాజేడు, న్యూస్‌టుడే: భారీ ఎన్‌కౌంటర్‌తో సరిహద్దుల్లో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వాజేడు మండలం పూర్తిగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతం కావడంతో అప్రమత్తమయ్యారు. శనివారం వాజేడు ఎస్సై-2 ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి సరిహద్దు పరిధి జాతీయరహదారిలోని గుమ్మడిదొడ్డి-వాజేడు-ఇప్పగూడెం ఆధ్వర్యంలో వాహనాలను సోదా చేశారు. వస్తుసామగ్రిని పరిశీలించి వివరాలను సేకరిస్తున్నారు.



వాహనంలోని వస్తు సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్సై ఇమ్మాన్యుయేల్

పండగ ప్రత్యేకం.. సంప్రదాయాల మమేకం

దసరా, సద్దుల బతుకమ్మ పండగల పేర్లు చెబితే ఎక్కడలేని సంతోషం కలుగుతుంది... ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా.. సొంతూళ్లకు సంతోషంగా తరలివస్తారు.. బడులు, కళాశాలలకు సెలవు రావడంతో పిల్లలంతా అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వచ్చి వాలిపోయి ఆటలాడతారు.. ఎంగిలిపూల బతుకమ్మ మొదలుకొని దసరా వరకు పల్లెల్లో బోలెడంత సందడి కనిపిస్తుంది. మహిళలంతా గుల్లల్లో, చెరువు కట్టల వద్ద బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. ఇక ఓరుగల్లు ప్రాంతంలో ఈ పండగను కొన్ని ఊళ్లల్లో మరింత ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.. ఆ విశేషాలతో 'ఈనాడు' కథనమిది..

–ఈనాడు, వరంగల్

అదిగదిగో మా ఊరు..
దసరా వచ్చిందంటే దాని తీరేవేరు..
అన్నాతమ్ముళ్లు అంటూ ఆత్మీయ పలకరింపులు
వదినా మరదళ్ల నవ్వుల తుళ్లింతలు..
గునుగు తంగేడు సోయగాలతో బతుకమ్మ ఆటలు..
ఉయ్యాలో.. రామ ఉయ్యాలో.. అంటూ ఆడపడుచుల పాటలు..
బంతి పూలు, మామిడాకులతో స్వాగతం పలికే గుమ్మాలు..
కమ్మని పిండివంటలతో ఇంటింటా ఘుమఘుమలు..
పట్టు పరికిణీల్లో సందడిచేసే పడుచు పిల్లలు..
జమ్మిచెట్టు వద్ద ఆత్మీయ ఆలింగనాలు..
అందుకే పట్నంవారంతా పల్లెబాట పడతారు..
ఎవరికివారు.. ఊళ్లల్లో
'ప్రత్యేకత'ను చాటుతున్నారు.

ఆదివారం ప్రత్యేకం

వందేళ్ల నాటి జమ్మిచెట్టు



పాండవులు అరణ్యవాసం సమయంలో జమ్మిచెట్టుపై ఆయుధాలు పెట్టారని, ఆ తర్వాత చెట్టుమీద నుంచి తీసి యుద్ధానికి వెళ్తే.. విజయం కలిగిందని పురాణ ప్రతీతి.. అందుకే ప్రతి ఊళ్లో దసరా రోజు గ్రామస్థులంతా జమ్మి చెట్టుకు పూజ చేయడం ఆనవాయితీ.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో సుమారు వందేళ్ల జమ్మి వృక్షం ఉంది. పండగ రోజు సాయంత్రం ఊరివారంతా డప్పుచప్పుళ్లతో పెద్ద గంపలో సొరకాయ, సజ్జ, జొన్న మొక్కలను పట్టుకుని దసరా బండ వద్దకు చేరుకుంటారు. అక్కడ కొత్తగా నిర్మించిన పాకలో సొరకాయకు పూజ చేస్తారు. అనంతరం జంతు బలికి బదులు సొరకాయను కోస్తారు. చారిత్రక జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కంకణాలు కట్టుకొని పూజలు చేస్తారు.

ఉప్పొంగే దేశభక్తి



దేశమంతా పంద్రాగస్టు, 26 జనవరి, తదితర రోజుల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. మహబూబాబాద్ జిల్లా గార్లలో మాత్రం దసరా రోజున నెలవంకను పోలిన జెండాను ఎగురవేయడం ఆనవాయితీగా వస్తోంది. గార్లలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న క్రమంలో ఆ వీధిని జెండా బజారుగా పిలుస్తున్నారు. పండగ రోజు పంచాయతీ నుంచి ఊరేగింపుగా జెండాను తీసుకెళ్లి మసీదు సెంటర్‌లో ఎగురవేస్తారు. అనంతరం తూర్పాంజనేయ స్వామి ఆలయంలో శమీ పూజ చేస్తారు.



అయిదో రోజు అద్భుతంగా



బతుకమ్మ పండగ అంటే సాధారణంగా మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ, చివరి రోజు సద్దుల బతుకమ్మను ఊరూవాడా సందడిగా చేస్తారు. మహబూబాబాద్ జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల్లో అయిదో రోజు కూడా బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు. భారీ పరిమాణంలో బతుకమ్మలను పూలతో పేర్చి మహిళలు బతుకమ్మలు ఆడి అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తారు.

భారీ రావణ వధ



వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో దసరా వేడుకలు కోలాహలంగా జరుగుతాయి. లక్షకుపైగా జనం హాజరై వేడుకల్ని తిలకిస్తారు. 65 అడుగుల రావణాసురుడి బొమ్మ తయారుచేస్తారు. అనంతరం బాణసంచాతో పేల్చేస్తారు. దసరా నాడు స్థానిక ఆర్య సమాజ్ నుంచి ఎడ్లబండిపై సీతారాముల వేషధారణలో కళాకారులను తీసుకొస్తారు. ముందు రంగస్థల కళాకారులు చిరుతల భజన చేస్తూ ఊరేగింపుగా తరలివస్తారు. వీరికి ఉత్సవ కమిటీ స్వాగతం పలుకుతుంది. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాక చివరకు రావణవధ ఉంటుంది. ఇదెంతో కనువిందు కలిగించే ఘట్టం. కర్ణాటకలోని మైసూరు తర్వాత అంత కోలాహలంగా వేడుకలు జరిగేది ఇక్కడే అని స్థానికులు చెబుతారు.

సరిహద్దు నుంచి సొంతూరుకు

వరంగల్ జిల్లా నర్సంపేటలో అన్ని ప్రాంతాల్లోలాగే వేడుకలు ఎంతో ఉత్సాహంగా చేస్తారు. హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డవారే కాదు సరిహద్దులో ఉన్న సైనికులు తప్పకుండా వస్తారు.. నర్సంపేటకు చెందినవారు సుమారు 30 మందికిపైగా సైన్యంలో సేవలందిస్తున్నారు.



జలపాతంలో పర్యాటకుల సందడి

బొగత జలపాతం పర్యాటకులతో సందడిగా మారింది. దసరా సెలవులు కావడంతో బొగతకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. గలగల పారుతున్న జలపాతం నీటిధారలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. జలపాతం రాతి కట్టపై వరదనీటి పరవళ్లను తిలకిస్తూ.. స్వీయచిత్రాలు తీసుకున్నారు. పర్యాటకుల రాకతో బొగత పరిసర ప్రాంతాలు సందడి నెలకొంది. – న్యూస్‌టుడే, వాజేడు(ములుగు జిల్లా)

ఎకో టూరిజంతో పర్యావరణ పరిరక్షణ

ములుగు, న్యూస్‌టుడే: ఏటూరునాగారం ఎకో సెన్సిటివ్ జోన్ పరిధికి సంబంధించిన నివేదికలు ఈ నెల 10లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి అటవీ శాఖ ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి నిర్ధారించడానికి అధికారులతో సమీక్షించారు. నివేదికలు సమర్పించిన తర్వాతనే ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ప్రకృతి సంపదను పరిరక్షిస్తూ, పర్యాటకులను ఆకర్షించేందుకు ఎకో టూరిజం ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుందన్నారు. పర్యావరణ హితం, సంరక్షణలో భాగంగా ఎకో టూరిజం పర్యాటక ప్రాంతాల్లో కొత్త ఆశలను నింపుతుందన్నారు. సహజ సిద్ధమైన అరణ్యాలు, పచ్చని వృక్షలు, జలపాతాలు, కొండల వంటి ప్రదేశాలు ముఖ్యమైన ఆకర్షణగా నిలుస్తున్నాయని తెలిపారు. ఎకో టూరిజం పర్యాటకులను ప్రకృతికి దగ్గర చేస్తూ పర్యావరణాన్ని రక్షించే దిశగా కొత్త మార్గాలను ప్రసరించడమే లక్ష్యంగా పని చేస్తోందని పేర్కొన్నారు. ఎఫ్‌డీవో వజ్రారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

స్వాధీనత ప్రకటన

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMECCC (21018), జె.పి.యన్.రోడ్డు, వరంగల్-506002. Ph: 0870-2424709, 2424707.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్-8(1) (స్థిరాస్తి కొరకు)

Housing Loan A/c No: 62322117219, Housing Loan Suraksha A/c No.62322117627

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECCC-21018, వరంగల్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(12)తో చదువుకొనే అనుబంధమైన నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: 1) శ్రీ గన్ను శ్రీనివాస్, తండ్రి: వెంకటనారాయణ,** హెచ్.నెం. 5-72/A/2, స్టేషన్ ఘన్‌పూర్ గ్రామము & మండలం, వరంగల్ జిల్లా. ఇక్కడ **కూడా:** హెచ్.నెం. 5-8-177, కిషాన్‌పుర, హన్మకొండ-506001. **2) శ్రీమతి గన్ను సునీత, భర్త: శ్రీనివాస్,** హెచ్.నెం. 5-72/A/2, స్టేషన్ ఘన్‌పూర్ గ్రామము & మండలం, వరంగల్ జిల్లా. ఇక్కడ కూడా: హెచ్.నెం. 5-8-177, కిషాన్‌పుర, హన్మకొండ-506001 వారిని నోటీసులో ఉదహరించబడిన **ది.30-07-2024 తేదీనాటికి బకాయిసొమ్ము రూ.15,44,812/- (అక్షరాల పదిహేను లక్షల నలభై నాలుగు వేల ఎనిమిది వందల పన్నెండు రూపాయలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు & అనుషంగిక ఖర్చులు** సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.30-07-2024న డిమాండ్ నోటీసు జారీచేయబడినది.**

ఋణగ్రహీతలు / హామీదారులు బకాయిసొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలు / హామీదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్స్ నందలి రూలు 8 ప్రకారము **1 తేదీ అక్టోబర్ 2024**న దిగువ పేర్కొన్న ఆస్తిని **నిర్మాణాత్మక స్వాధీనత తీసుకోవడమైనదని** ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి **ది.30-09-2024 నాటికి రూ.15,78,023/- (అక్షరాల పదిహేను లక్షల డెబ్బై ఎనిమిది వేల ఇరవై మూడు రూపాయలు మాత్రమే) + ది.01.10.2024 తేదీ నుండి వడ్డీ & ఖర్చులు** మొ॥నవి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి** ఛార్జీకి లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

తనఖావుంచిన స్థిరాస్తి యొక్క వివరములు

వరంగల్ (అర్బన్) జాయింట్ సబ్-రిజిస్ట్రార్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా మరియు వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ లిమిట్స్ పరిధిలో తేది.13-12-2013 తేదీగల విక్రయ దస్తావేజు నెం. 10365/2013 ద్వారా శ్రీమతి జి.సునీత పేరుసగల ఆస్తి. వరంగల్ జిల్లా, హన్మకొండ, కిషన్‌పుర నందు 361.11 చ॥గ॥ లేదా 301.92 చ॥మీ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ ఇంటి మునిసిపల్ నెం. 5-8-177 కు సంబంధించిన యావదాస్తి. **ఈ దిగువ హద్దులలో: తూర్పు:** 20 అ॥ రోడ్డు; **పడమర:** శ్రీ రంగయ్య యొక్క ఇల్లు; **ఉత్తరం:** శ్రీ ప్రభాకర్ రావు యొక్క ప్లాట్; **దక్షిణం:** శ్రీ సలీమ్ పాషా మరియు ఇతరుల యొక్క ఇల్లు.

తేది : 01-10-2024
ప్రదేశం : వరంగల్

సం/- అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



విజయదశమి ఉత్సవాలకు కేంద్ర మంత్రికి ఆహ్వానం

ములుగు, న్యూస్‌టుడే: అక్టోబర్ 12న ములుగులో నిర్వహించనున్న రావణాసురవధ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరుతూ ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మంత్రికి వివరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంధ్రకోట కుమార్, సామాజిక వేత్త కృష్ణారెడ్డి, సభ్యులు బైకని ఓదెలు, మాదం కుమార్, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలు కావివి.. అధ్వాన దారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు ఏటూరునాగారం మండలంలోని కొండాయి నుంచి ఊరట్టం గ్రామం వరకున్న 8 కిలోమీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. ప్రతి వందమీటర్ల దూరంలో బురదమయంగా మారి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై నుంచి వెళ్తే వాహనాలు కూరుకుపోయే పరిస్థితి నెలకొంది. 2016లో అప్పటి మేడారం మహాజాతర సమయంలో ఈ రహదారిని రూ.19 కోట్ల ఆర్‌డీఎఫ్ గ్రాంటు కింద పక్కా రోడ్డుగా మార్చాలని పనులు చేపట్టారు. అప్పట్లో అటవీశాఖ అభ్యంతరంతో ఈ పనులు నిలిచిపోయాయి. అనుమతులొచ్చాయి ఇక ప్రారంభిస్తామంటూ అధికారులు, పాలకులు ప్రగల్భాలకే పరిమితమవుతున్నారు. అప్పట్లో కల్వర్టులు, చిన్నచిన్న బ్రిడ్జి పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత రోడ్డు వేసే దశలో అటవీ శాఖ అడ్డుకుంది. కల్వర్టులు అసంపూర్తిగా ఉన్న చోట డైవర్షన్ దారులను వేశారు. ఈ డైవర్షన్ రోడ్లు కూడా వరద తీవ్రతకు తెగిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతాల నుంచి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రోడ్డు పూర్తయినా, దొడ్ల, మల్యాల గ్రామాల మధ్యనున్న జంపన్నవాగుపై వంతెన పూర్తయితేనే తప్ప కొండాయి, గోవిందరాజుల కాలనీ, మల్యాల గ్రామస్థులకు రవాణా కష్టాలు తొలగనున్నాయి. వీటికి దారి కష్టాలు ఇంకెంత కాలమో అధికారులు, పాలకులే తెలియాలి.



ట్రాక్టర్ మినహా ఇతర వాహనాలు వెళ్లలేని దుస్థితిలో..



కొండాయి-ఊరట్టం మార్గం


ఈ విద్యాలయం.. సైనికుల కర్మాగారం!

ఖానాపురం(నర్సంపేట), న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లోని సైనిక్ స్కూల్‌లోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ అకాడమి దేశరక్షణకు మెరికల్లాంటి సైనికులను అందిస్తోంది. ఇక్కడ చదివిన పలువురు విద్యార్థులు సరిహద్దుల్లో సైనికులుగా పనిచేస్తూ దేశ రక్షణలో పాలు పంచుకుంటున్నారు. ఈ విద్యాలయంలో చేరిన నిరుపేద గిరిజన విద్యార్థులకు విద్య, వసతితో పాటు వ్యాయామం, దేహదారుఢ్యం తదితర అంశాల్లో పటిష్ఠ తర్ఫీదు ఇస్తున్నారు. పలు అంశాలను ఆకళింపు చేసుకుంటున్న విద్యార్థులు.. ప్రభుత్వం నిర్వహించే శారీరక, రాత పరీక్షలను సులువుగా అధిగమించి భారత సైన్యం, అగ్నివీర్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, నేవీ, పోలీసు తదితర విభాగాల్లో ఎంపికై సేవలందిస్తున్నారు. 1984లో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాల అంచెలంచెలుగా ఉన్నతీకరణ చెంది సైనిక్‌స్కూల్‌గా మారింది. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో త్రివిధ రక్షణ దళాలు, భద్రత, తదితర విభాగాల్లో 22 మంది సేవలందిస్తున్నారు. అగ్నివీర్‌కు నలుగురు, జీడీఎస్ పోస్టల్‌కు ముగ్గురు, ఫైర్‌మెన్ ఏవోసీకి ఒకరు, సీఆర్పీఎఫ్‌కు ఒకరు, బీఎస్ఎఫ్‌కు ఒకరు, భారత సైన్యానికి ఐదుగురు, నావికా దళానికి ఇద్దరు, టీఎస్ పోలీస్ కానిస్టేబుళ్లుగా ఐదుగురు ఎంపికయ్యారు.



సైనిక్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

డిగ్రీ ద్వితీయ ఏడాదిలోనే ఎంపికయ్యా..



సైనిక్‌స్కూల్‌లో ఇంటర్‌లో చేరాను. డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఆర్మీకి ఎంపికయ్యాను. ఇక్కడి అధ్యాపకులు ఇచ్చిన తర్ఫీదు వల్లే ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో పని చేస్తున్నా. దేశ రక్షకుడిగా పని చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చు. **-రాము**

అధ్యాపకుల శిక్షణ తోడ్పడింది



ఇంటర్‌లో పాఠశాలలో చేరాను. భారత సైన్యానికి ఎంపికయ్యేందుకు. అధ్యాపకులు, ఇన్‌స్ట్రక్టర్లు అందించిన శిక్షణ తోడ్పడింది. తక్కువ సమయంలో ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది. **-జవిందర్**

గురుకులంలో చదవడం అదృష్టం



డిఫెన్స్‌లో ఫైర్‌మెన్ ఏవోసీకి ఎంపికయ్యాను. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతుండగా ఉద్యోగం వచ్చింది. గురుకులంలో చదవడం నా అదృష్టం. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు. తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటా. **-సింహాద్రి**

ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా



డిగ్రీ చదువుతుండగానే ఉద్యోగం వచ్చింది. నేవీలో శిక్షణ పూర్తయింది. పాఠశాల ఉపాధ్యాయుల సూచనలు పాటించి పట్టుదలతో చదివి ఈవెంట్లు చేశాను. ఉన్నతాధికారిగా దేశానికి సేవలందిస్తా. **-భరత్**

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ - సురేందర్, ప్రిన్సిపల్, సైనిక్‌స్కూల్, అశోక్‌నగర్

క్రమశిక్షణతో చదివితే ఉద్యోగాలు సాధించడం సులువని సైనిక్‌స్కూల్ విద్యార్థులు నిరూపించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతాం. అందరి కృషితోనే ఇది సాధ్యమైంది.

ఉపాధి కోసం వెళ్లి.. తూటాకు బలై!

● ఉగాండాలో జనగామ సివిల్ ఇంజినీర్ హత్య



తిరుమలేష్ (పాత చిత్రం)



స్వగృహంలో రోదిస్తున్న తల్లి కిష్టమ్మ, బంధువులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే : ఉన్నత విద్య అభ్యసించారు.. ఉపాధి మార్గం వెతుక్కుంటూ విదేశానికి వెళ్లారు.. జీవితం అంతా సాఫీగా సాగుతుందనుకున్న సమయంలో తుపాకీ తూటా రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఈ ఘటన జనగామ పట్టణంలో విషాదం నింపింది. జనగామ పట్టణం తొమ్మిదో వార్డు గిర్నిగడ్డకు చెందిన ఇటికాల తిరుమలేశ్(42) సివిల్ ఇంజినీర్ పూర్తి చేశారు. కొంతకాలం కరీంనగర్‌లో ఉద్యోగం చేసిన అనంతరం ఉగాండా దేశంలోని రాయల్‌టెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో అవకాశం రావడంతో పదేళ్ల క్రితం అక్కడికి వెళ్లారు.. ప్రాజెక్టు మేనేజర్ హోదాలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉగాండాలోని నమ్మశాల ప్రాంతంలోని కంపెనీలో శుక్రవారం తిరుమలేష్ విధుల్లో ఉండగా శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో(భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలు) అదే కంపెనీకి చెందిన సెక్యూరిటీ గార్డు తాగిన మైకంలో ఒక్కసారిగా తుపాకీతో గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. భారీ శబ్దం విని బయటకు వచ్చిన తిరుమలేష్‌పైనా విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు కూడా తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ ఘటనతో భయకంపితులైన కంపెనీలోని ఇతర ఉద్యోగులు బయటకు రాలేదు. తిరుమలేష్ మృతిచెందిన విషయాన్ని కంపెనీ ప్రతినిధులు జనగామలో ఉంటున్న తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నాకు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. తిరుమలేష్‌కు భార్య సునీత, కుమార్తె అఖిల, కుమారుడు వరుణ్ ఉన్నారు. కుమార్తె అఖిల నిజామాబాద్‌లోని అమ్మమ్మ ఇంటి వద్ద 8వ తరగతి చదువుతోంది. కుమారుడు వరుణ్ ఉగాండాలోనే తల్లిదండ్రులతో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. తిరుమలేష్ తండ్రి కిష్టయ్య కరోనాతో నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. మృతుడి తల్లి కిష్టమ్మతో పాటు మరో సోదరుడు చిన్నా, సోదరి హేమలత జనగామలోనే ఉంటున్నారు. తిరుమలేష్ మృతి వార్త తెలియగానే ఆయన ఇంటికి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీళ్లు పెట్టుకున్నారు.

అంతా సివిల్ ఇంజినీర్లే

మృతిచెందిన తిరుమలేష్ సివిల్ ఇంజినీర్ కాగా, అతని సోదరుడు చిన్నా కూడా సివిల్ ఇంజినీర్‌గా సిద్దిపేటలో పనిచేస్తున్నారు. తండ్రి కిష్టయ్య సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోనే పనిచేసేవారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి స్థానాలకు చేర్చిన తండ్రి కిష్టయ్య కరోనాతో దూరంగా కాగా, ఇప్పుడు ఇంటి పెద్ద కొడుకు తిరుమలేష్ కూడా చనిపోవడంతో తల్లి కిష్టమ్మతో పాటు కుటుంబమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. తిరుమలేష్ మృతదేహాన్ని మంగళవారం వరకు జనగామకు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు సోదరుడు చిన్నా తెలిపాడు. ఉగాండాలోని ఎంబసీ అధికారులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా సమాచారం చేరవేసి మృతదేహం రప్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు కార్యక్రమం



బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో ఆదివారం (అక్టోబర్ 6వ తేదీ) ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

అండర్-19 క్రికెట్ పోటీల విజేత కరీంనగర్

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలో మహబూబ్‌నగర్ జట్టుపై కరీంనగర్ 2 వికెట్లతో తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఓరుగల్లు జిల్లా కేంద్రంగా నిర్వహించిన అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. శనివారం వరంగల్ నగర శివారులో ఉన్న మొగిలిచర్ల మైదానంలో మహబూబ్‌నగర్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల జట్ల మధ్య తుదిపోరు జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. జట్టులో షాదాబ్ 89, అబ్దుల్ 48 పరుగులతో రాణించారు. కరీంనగర్ బౌలర్లు విఘ్నేష్, అర్షద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో కరీంనగర్ జట్టు 49.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసి విజేతగా నిలిచింది. విఘ్నేష్ 53 పరుగులు, క్రమాన్ 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకలో అతిథులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అండర్-19 టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రికెటర్లను హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు పెద్ది ప్రవీణ్‌గౌడ్, బస్వరాజు శ్రీమాన్, ఉదయభానురావు, వెంకటేశ్వర్లు, రఘురాం, ఉపేందర్, రాము, కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కరీంనగర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

'అలుగు' అక్రమ రవాణా కేసులో స్మగ్లర్ల అరెస్టు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని మేడిపెల్లి టోల్‌గేట్ ప్రాంతంలో అలుగు (పొంగలిన్) రవాణాకు పాల్పడిన కేసులో శనివారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు భూపాలపల్లి అటవీ అధికారులు తెలిపారు. ఇదే కేసులో చెన్నైకి చెందిన వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో, ఇంటెలిజెన్స్ అధికారులు చాకచక్యంగా కొనుగోలుదారుల రూపంలో తాటి రాజ్‌కుమార్, ఎండీ. నజీర్, ఎండీ.అమ్జద్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని హనుమకొండకు తరలించిన విషయం తెలిసిందే. వీరిని విచారించగా మరో ఐదుగురి ప్రమేయం ఉందని నిందితులు చెప్పినట్లు స్థానిక రేంజి అధికారి నరేష్ అరెస్టు వివరాలను వెల్లడించారు. గట్టు సమ్మయ్య, తాళ్లపల్లి శంకర్, ఊరుగొండ దేవన్న, పెద్ది లక్ష్మయ్య, నరివెద్ది వెంకటనారాయణ కోసం గాలించగా గట్టు సమ్మయ్య, నరివెద్ది వెంకటనారాయణను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారీలో ఉన్నారని, మొత్తం 8 మందిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో కాటారం మండలం కొత్తపల్లి, ములుగుపల్లి, ఇబ్రహీంపల్లికి చెందిన తాటి రాజ్‌కుమార్, గట్టు సమ్మయ్య, ఎండీ.అమ్జద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన ఎండీ. నజీర్, భూపాలపల్లికి చెందిన నరివెద్ది వెంకటనారాయణ ఉన్నారు. వీరి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు రేంజి అధికారి నరేష్ తెలిపారు. కాటారం అటవీ రేంజి అధికారి హసీప్ అలీ, సెక్షన్ అధికారి సంతోష్, బీట్ ఆఫీసర్లు ప్రశాంత్, భాస్కర్ పాల్గొన్నారు.



అరెస్టు చూపుతున్న భూపాలపల్లి అటవీ అధికారులు

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కుస్తీ పోటీల్లో ఓరుగల్లుకు కాంస్యం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్‌ఐ) కుస్తీ(రెజ్లింగ్) పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. నారాయణపేట జిల్లా ధన్వాడలో శనివారం జరిగిన కుస్తీ పోటీల్లో అండర్-19 బాలికల జట్టు పతకాలతో రాణించింది. బి.అంజలి 55 కిలోల విభాగంలో స్వర్ణం కైవసం చేసుకుంది. 69 కిలోల విభాగంలో సౌమ్య, 76 కిలోల విభాగంలో ఎన్.అంజలి రజత పతకాలు, 59 కిలోల విభాగంలో కావేరి, 72 కిలోల మైత్రేయి కాంస్య పతకాలు సాధించారు. స్వర్ణం నెగ్గిన బి.అంజలి దిల్లీలో జరిగే ఎస్‌జీఎఫ్‌ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు హనుమకొండ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, హనుమకొండ కళాశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన రెజ్లర్లను హనుమకొండ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గోపాల్, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం కార్యదర్శి కరీం అభినందించారు.



తృతీయ స్థానంలో నిలిచిన జట్టుతో అతిథులు

నిరుపయోగం.. క్రీడా ప్రాంగణం



గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. ఏటూరునాగారం మండలంలోని చల్పాక గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు మాత్రమే కనిపిస్తోంది. ఇక్కడ వాగు సమీపంలో ఉండటంతో.. నిరుపయోగంగా మారింది. పక్కనే ఉన్న పల్లెప్రకృతి వనం ఫెన్సింగ్ వద్ద క్రీడా సామగ్రిని పడేశారు. పంచాయతీ నిర్వహణ లోపం కారణంగానే నిర్లక్ష్యానికి గురవుతోంది. - న్యూస్‌టుడే, కన్నాయిగూడెం

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: బాల్యవివాహాలు చట్ట ప్రకారం నేరమని ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. ములుగు మండలం సర్వాపూర్ గ్రామంలో శనివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు అలవాటు పడి యువత జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లక్ష్యాన్ని ఎంచుకుని చదువులో రాణించాలన్నారు. గ్రామంలో నేరాలను తగ్గించేందుకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిన చెట్ల తొలగింపు



వాజేడు, న్యూస్‌టుడే: మండలంలోని పెదగొల్లగూడెం గ్రామంలో ప్రమాదకరంగా మారిన ఎండిన చెట్టును తొలగించారు. 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ మండల అధికారులను ఆదేశించడంతో త్వరితగతిన శనివారం పనులను చేపట్టారు. పెదగొల్లగూడెం పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానికుల సాయంతో పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించారు.

ఈనాడు కథనానికి స్పందన

మేమున్నాం.. మీకు తోడుగా

వాజేడు: 8008573708, వెంకటాపూర్: 9440692140
ఏటూరునాగారం: 9440194979, వెంకటాపురం: 8008624242

తాడ్వాయి, న్యూస్‌టుడే: తాడ్వాయి పంచాయతీ శివారు గ్రామం నర్సింగాపురంలో వీధి దీపాలు వెలగడం లేదు. పండగ సమయం కావడంతో అవస్థలు పడుతున్నాం. **- గడ్డం శ్రీకాంత్, నర్సింగాపురం**

సమస్య మా దృష్టిలో ఉంది. సోమవారం నాటికి అన్ని వీధుల్లో దీపాలు ఏర్పాటు చేస్తాం. **- రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి, తాడ్వాయి**

పస్రా,(గోవిందరావుపేట), న్యూస్‌టుడే: పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని నేతాజీనగర్ తండాలో తాగు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పైప్ లైన్ లీకేజీ అవుతోంది. **- స్థానికులు, నేతాజీనగర్**

రెండు రోజుల్లో మరమ్మతులు చేయించి సరఫరాను పునరుద్ధరిస్తాం. **- శ్వేత, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, పస్రా**

పారిశుద్ధ్య చర్యలు



కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కంతనపల్లిలో వాటర్‌ట్యాంకు వద్ద పరిసరాలు అధ్వానంగా ఉన్నాయనే సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సెప్టెంబరు 30న సమస్య ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి నారాయణ తమ సిబ్బందితో పరిసరాల్లో బ్లీచింగ్ పొడిని చల్లించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

స్పందనకు వందనం

వ్యర్థాల సేకరణ



కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: సర్వాయిలోని రహదారి పక్కన వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందనే సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సెప్టెంబరు 30న సమస్య ప్రచురితమైంది. సమస్యపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి మనోజ్ తమ సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్‌లో తరలించారు.

తాగునీటి సరఫరాలో లోపాలు నివారించాలి


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీవో సుమనవాణి

తాడ్వాయి, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని ఎంపీడీవో సుమనవాణి సూచించారు. తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ పొందిన 25 మంది సహాయకులకు ఎంపీడీవో సుమనవాణి ధ్రువీకరణ పత్రాలు అందజేసి మాట్లాడారు. మండలంలోని తాగునీటి సహాయకులందరూ స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల సూచనల మేరకు ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే స్పందించాలన్నారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలు, చేతిపంపుల మరమ్మతులు, విద్యుత్తు మోటార్ల సమస్యలను గుర్తించి సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నవీన్‌కుమార్, రిసోర్సు పర్సన్స్ సత్యనారాయణరెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


అధ్వానం.. జీసీసీ బంకు నిర్వహణ


మూలనపడిన జనరేటర్


నిరీక్షిస్తున్న వినియోగదారులు, ఖాళీగానే బంక్ సిబ్బంది


వెంకటాపురం(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: వెంకటాపురం మండలంలోని వీరభద్రవరంలో ఏర్పాటు చేసిన జీసీసీ(గిరిజన ప్రాథమిక సహకార సంఘం) బంక్ నిర్వహణ అధ్వానంగా ఉంది. రూ.లక్షల నిధులతో నెలకొల్పిన ఈ బంక్ ద్వారా వినియోగదారులకు సేవలు సకాలంలో అందని పరిస్థితి నెలకొంది. అధికారుల పట్టింపు లేమితో వినియోగదారులు ఇక్కట్లు పడాల్సి వస్తోంది. విద్యుత్తు సరఫరా నిలిస్తే ఇంధనం నింపడం ఆగిపోతోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన జనరేటర్ కొద్ది నెలలుగా మరమ్మతులతో మూలన పడింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా కొనసాగుతున్న క్రమంలో రైతులు దుక్కులు దున్నేందుకు, విత్తనాలు నాటేందుకు యంత్రాలకు ఇంధనం ఉపయోగిస్తున్నారు. వ్యాపారం ముమ్మరంగా సాగే సమయంలో అధికారులు ఇక్కడ సేవల్లో అశ్రద్ధ చూపిస్తుండటంతో.. ఆగ్రహం చెందుతున్నారు. కరెంటు సరఫరా నిలిచిన సమయంలో ఇక్కడ పనిచేసే ఉద్యోగులు సైతం ఏమీ చేయలేక ఎదురుచూస్తున్నారు. ఉన్నతమైన ఆశయంతో ఏర్పాటు చేసిన బంక్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


వాజేడు మండలపరిధిలోని ధర్మారంలో..


గోవిందరాజస్వామి ఆలయంలో హోమ క్రతువు


వెంకటాపూర్‌లో అన్నదానం(ప్రసాదం)లో పాల్గొన్న భక్తులు


కేశవాపూర్‌లో..


మంగపేట మండల కేంద్రంలో

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మూడో రోజు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీలచే అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, యంత్రాంగం


పాలంపేటలో..


పస్రాలో


వెంకటాపురం మండల కేంద్రంలో


ములుగులోని రామాలయం ప్రాంగణంలో..


గోవిందరావుపేట తారకరామా కాలనీలో

ములుగులో ఉచిత యోగా శిక్షణ



ములుగు, న్యూస్‌టుడే: ములుగులో శనివారం ఉదయం ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం తంగేడు మైదానంలో జరిగింది. పట్టణానికి చెందిన పలువురు ఔత్సాహికులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీగురు యోగాలయం వ్యవస్థాపకుడు కె.శివకృష్ణ ఆధ్వర్యంలో పలు ఆసనాలు వేశారు. ఈ శిక్షణ ఆదివారం కూడా కొనసాగనుంది. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని శివకృష్ణ తెలిపారు.

జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి


విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న జిల్లా సంఘం ప్రతినిధులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఝార్ఖండ్ రాష్ట్రంలో సెప్టెంబర్ 28 నుంచి ఈనెల 2 వరకు జాతీయస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మాసయ్య, రవి అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. క్రీడలు ముగించుకుని విజేతలుగా వచ్చిన విద్యార్థులను వరంగల్ జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. వరంగల్ జిల్లా ఖోఖో సంఘం ప్రతినిధులు తోట శ్యాంప్రసాద్, కుసుమ సదానందం, రమణ, గోనెల సదానందం, రంజిత్, రాజేందర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఖోఖో కోచ్ రాజారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం


రాచపల్లి శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి సోహల్, సిబ్బంది

వెంకటాపురం, న్యూస్‌టుడే: ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని వైద్యాధికారి సోహల్ అన్నారు. ఎదిర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. అసంక్రమిత వ్యాధిగ్రస్థుల గుర్తింపునకు ఏర్పాటు చేసిన శిబిరాల్లో చికిత్సలు అందించారు. మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్యుల సూచనలతో ఆహారం, వ్యాయామం, మందుల వినియోగం చేపట్టాలన్నారు. వెంకటాపురం, రాచపల్లి, చొక్కాల, ఆలుబాక, తిప్పాపురం, ఎదిరకాలనీ, రామచంద్రాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో వైద్యులు పవన్‌కల్యాన్, స్నేహ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎంలు సేవలందించారు.

రామప్పలో మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్


శిల్పకళను వీక్షిస్తూ..

వెంకటాపూర్, న్యూస్‌టుడే: కాకతీయుల కళాక్షేత్రమైన రామప్పను శనివారం వరంగల్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టూరిజం గైడ్లు ఆలయ చరిత్ర, శిల్పకళా సంపద గురించి వివరించారు. అద్భుత రామప్ప శిల్పాల నడుమ కుటుంబ సమేతంగా ఫొటోలు దిగారు. ఆలయ ప్రాంగణంలో కాసేపు గడిపి వెళ్లారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. మంగపేటకు చెందిన హోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏటూరునాగారంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమానికి సీఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని తెలిపారు. పోటీల విజయవంతానికి క్రీడాకారులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఖాలీద్, ఏటూరునాగారం, మంగపేట ఎస్సైలు తాజుద్దీన్, టీవీఆర్.సూరి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం స్థలానికి హద్దుల ఏర్పాటు


సొసైటీ స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరులో ఏటూరునాగారం-బూర్గంపాడ్ ప్రధాన రహదారి పక్కనున్న సహకార సంఘం స్థలానికి శనివారం రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేశారు. సహకార సంఘ స్థలం విషయంపై కొంత మంది ఆక్రమణకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుండగా, అధికారులు వాటిని తిప్పి కొట్టారు. మంగపేట ఇన్‌ఛార్జి తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ సఫియా స్థలం వద్దకు చేరుకుని సహకార సంఘం ఛైర్మన్ తోట రమేశ్, సీఈవో జగన్నాధరావు, మంగపేట పోలీసులు, పలు పార్టీల నాయకులు, సంఘాల నాయకులు గ్రామస్థుల సమక్షంలో సర్వే చేశారు. సర్వే నెంబరు 9లోని 17 గుంటల విస్తీర్ణానికి గ్రామ నక్ష, టిప్పన్, రెవెన్యూ రికార్డుల ప్రకారం హద్దులు ఏర్పాటు చేసినట్లు మల్లేశ్వర్‌రావు తెలిపారు. అనంతరం సిమెంట్ స్తంభాలు పాతి స్థలం చుట్టూ కంచె వేశారు. కొలతల సమయంలో గ్రామానికి చెందిన కొందరు వాగ్వాదానికి దిగడంతో పోలీసుల జోక్యం చేసుకోవడంతో శాంతించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం


గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ములుగు, న్యూస్‌టుడే: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య సూచించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శనివారం దిశ హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో అప్పయ్య ముఖ్యఅతిథిగా హాజరై ఎయిడ్స్ అవగాహన గోడపత్రికలను విడుదల చేశారు. నివారణకు గ్రామాల్లో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులపై వివక్ష చూపొద్దన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ డా.భవ్యశ్రీ, సీపీఎం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జ్యోతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


చెట్లు కూలిపోవడానికి దారితీసిన పరిస్థితులను వివరిస్తున్న పర్యావరణవేత్త సతీష్

తాడ్వాయి, న్యూస్‌టుడే: ప్రకృతి బీభత్సం కారణంగా తాడ్వాయి మండలంలో కూలిపోయిన వృక్షసంపదను శనివారం హనుమకొండకు చెందిన వాగ్దేవి కళాశాల విద్యార్థులు సందర్శించారు. కళాశాలలో డిగ్రీ, పీజీ వృక్షశాస్త్రం చివరి సెమిస్టర్ చదువుతున్న 80 మంది విద్యార్థులు తాడ్వాయి-మేడారం మార్గమధ్యంలోని రహదారికిరువైపులా నేలకూలిన చెట్లను పరిశీలించారు. విద్యార్థుల వెంట వచ్చిన పర్యావరణవేత్త డాక్టర్ సతీష్ అడవులకు నష్టం జరగడానికి దారితీసిన పరిస్థితులను వివరించారు. ప్రపంచ వాప్తంగా పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రకృతి సమతుల్యతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కవిత, మనిషా, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతా మండలిలో సభ్యత్వం పొందడమే లక్ష్యం


సభ్యత్వ నమోదులో పాల్గొన్న భాజపా శ్రేణులు

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం పొందడమే లక్ష్యంగా భాజపా అంతర్జాతీయంగా విశేష కృషి చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొత్త సుధాకర్‌రెడ్డి అన్నారు. గోవిందరావుపేట మండలం రంగాపూర్ గ్రామంలోని 79వ బూత్‌లో భాజపా నాయకులు మేరుగు సత్యనారాయణ, వలపదాసు రవిశంకర్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. భారత ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందన్నారు. పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో భాజపా గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు జమ చేస్తుందన్నారు. దేశంలోని ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తుందన్నారు. దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ భాజపాలో చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నానాజీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు


ప్రభుత్వ స్థలం బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలం బీసీమర్రిగూడెం పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డును శనివారం రెవెన్యూ అధికారులు తొలగించారు. రంగరాజపురంకాలనీలోని ఈ స్థలాను ఆక్రమించేందుకు ఒకరు షెడ్డును ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారంతో సంఘటన ప్రాంతాన్ని పరిశీలించినట్లు తహసీల్దారు పి.లక్ష్మీరాజయ్య తెలిపారు. సర్వే చేపట్టగా, ప్రభుత్వ స్థలంగా తేలడంతో ఆర్ఐ మల్లయ్య, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో షెడ్డును కూల్చివేశారు. ప్రభుత్వ భూమిగా బోర్డును సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: ఏటూరునాగారం మండలంలోని విద్యుత్తు వినియోగదారులు విద్యుత్తు సరఫరాలో అంతరాయానికి సహకరించాలని ఏఈ అశోక్ తెలిపారు. ఈ నెల 6న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. లైన్ల సమీపంలోని చెట్ల కారణంగా తరచుగా సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వాటిని తొలగించేందుకు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

గిరిజన పల్లెల్లో సిమెంట్ రోడ్లు నిర్మించాలి


మాట్లాడుతున్న ఏఎస్‌పీ జిల్లా కన్వీనర్ సతీశ్

వెంకటాపురం, న్యూస్‌టుడే: గిరిజన పల్లెల్లో సిమెంట్ రహదారులను నిర్మించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీశ్ డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల కేంద్రంలో శనివారం జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ పల్లెలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. వెంకటాపురానికి కూతవేటు దూరంలో ఉన్న శాంతినగర్ గ్రామం ఏర్పాటై ఇరవై ఏళ్లు దాటినా రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే మండలంలోని సీతారాంపురం, తిప్పాపురం, ముత్తారం, కొండాపురం గ్రామాల్లో ఆదివాసీ కాలనీలకు అంతర్గత రహదారులను ఆధునీకరించాలని చెప్పారు. గిరిజన పల్లెల దుస్థితిని ఐటీడీఏ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా ఆదివాసీ పల్లెల్లో రహదారుల దుస్థితిని పట్టించుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు తుర్స కృష్ణబాబు, శంకర్, రాజు, మహేశ్, సతీశ్, మంజుల, శిరీష తదితరులు పాల్గొన్నారు.